ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం 6లో..

రామగుండంలో మళ్లీ డివిజన్ల పునర్విభజన 6లో..

# పంచాయతీలకు నిధుల కొరత



- ఏడాది కాలంగా విడుదల కాని వైనం
- చెల్లింపు కాని బిల్లులు, సిబ్బందికి అందని వేతనాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలోని గ్రామ పంచాయతీలను నిధుల కొరత వెంటాడుతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు విడుదల చేసే నిధులను సకాలంలో విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. నిధులు వస్తాయని చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల కోసం మాజీ సర్పంచులు కార్యాలయాల చుట్టూ తిరుగుతుండగా, పంచాయతీ సిబ్బందికి వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పారిశుధ్య పనులు, తాగునీటి నివారణ పనులు, వీధి లైట్లు వేయడం వంటి పనులు ముందుకు సాగడం లేదు.

కొన్ని పంచాయతీల్లో కార్యదర్శులు నిధులను సర్దుబాటు చేసేందుకు తంటాలు పడుతున్నారు. జిల్లాలో 267 గ్రామ పంచాయతీలు ఉండగా, పాలక వర్గాల పదవీ కాలం ఈ ఏడాది ఫిబ్రవరి 3వ తేదీతో ముగిసింది. దీంతో ఆ వెంటనే ఎన్నికలు నిర్వహించని ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన తీసుకవచ్చింది.

గ్రామ పంచాయతీల నిర్వహణకు ప్రజల నుంచి ఇంటి పన్నులు, నల్లా పన్నులు వసూలు చేస్తుంటారు. అలాగే భూముల క్రయ విక్రయాల ద్వారా సమకూరే రుసుంల నుంచి కొంత సొమ్మును జమచేయనున్నారు. ఖనిజ వనరులను వినియో గించుకోవడం వల్ల సీనరేజీ పన్నులు జమ కానున్నాయి. ఇవన్నీ జనరల్ ఫండ్ కింద పంచాయతీ ఖాతాల్లో జమ కానున్నాయి. ఈ నిధులతో సిబ్బంది వేతనాలు, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, తదితర అవసరాలకు వినియో గించుకోవాల్సి ఉంటుంది. ఇవేగాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు జమ చేస్తాయి. జనాభా ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా ప్రతి మూడు మాసాలకోసారి నిధులను విడుదల చేయనున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక సంస్థ నుంచి నెలనెలా నిధులను విడుదల చేయనున్నారు. ఈ నిధులతో గ్రామంలో మౌలిక వసతులు కల్పించేందుకు పలు అభివృద్ధి పనులు చేయాల్సి ఉంటుంది.

## సర్దుబాటు చేసేందుకు కార్యదర్శులు సతమతం..

పన్నుల వసూళ్లు సక్రమంగా జరగక, సీనరేజీ పన్నులు జమ కాక పంచాయతీలకు ఆదాయం సమకూరడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెగ్యులర్‌గా నిధులను విడుదల చేయకపోవడంతో అభివృద్ధి పనులు, పంచాయతీల నిర్వహణ కుంటు పడుతున్నది. ఏడాది కాలంగా రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి, 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదల కావడం లేదు. గత నెలలో 15వ ఆర్థిక సంఘం నిధులు ఒక క్వార్టర్ విడుదలైనట్లుగా చెబుతున్నారు. ఇది వర్షాకాలం కావడంతో పారిశుధ్య నిర్వహణ, శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేయకుంటే ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతుంటారు. పదవిలో ఉన్నప్పుడు అభివృద్ధి పనులు చేసిన మాజీ సర్పంచుల బిల్లులు కూడా ముందుకు జరగడం లేదు.

వేసవి కాలంలో కొందరు పంచాయతీ కార్యదర్శులు తాగునీటి ఎద్దడి నివారణకు సంబంధించిన మరమ్మతు పనులు చేశారు. ఆ పనులకు సంబంధించిన బిల్లులు ఇంతవరకు రాక కార్యదర్శు లు ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయం, వీధిలైట్లు, తాగునీటి పథకాల మోటార్ల కరెంట్ బిల్లుల చెల్లించాలని కార్యదర్శులపై విద్యుత్ శాఖాధికారులు ఒత్తిడి తీసుకవస్తున్నారు. దీంతో కొందరు కార్యదర్శులు సొంతంగా డబ్బులు సర్దుబాటు చేసి చెల్లిస్తున్నారు. మల్టీపర్పస్ వర్కర్లకు ఒక్కొక్కరికి నెలకు 9,500 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. ఆయా పంచాయతీల్లో వారికి జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొన్నది. సర్పంచులు ఉన్నప్పుడు ఆ జీతాలను వాళ్లు ముందుగా సర్దుబాటు చేసి నిధులు వచ్చిన తర్వాత తీసుకునే వాళ్లు. ఇప్పుడు ఆ భారం కార్యదర్శులపై పడుతున్నది. బీసీ గణన కానిదే పంచాయతీ ఎన్నికలు జరిగే అవకా శాలు కనబడడం లేదు. మరో నాలుగైదు మాసాలు గడిస్తే గానీ పంచాయతీలకు నిధులు వచ్చే పరిస్థితి లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి పంచాయతీలకు నిధుల విడుదల చేస్తేనే మనగడ సాధిస్తాయి.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



మందులను అందజేస్తున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, సెప్టెంబరు 5: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని నందిమేడారం రైతు వేదికలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య పరీక్షలు చేయాలని సూచించారు. ప్రజలు ఎవరూ కూడా జ్వరాలు వస్తున్నాయని భయాందోళన చెందవద్దని చెప్పారు. ఈ శిబిరంలో జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్, నందిమేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుష్మిత, తహసీల్దార్ రజిత, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సిబ్బందిపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు

- గోదావరిఖని ఏసీపీ రమేష్



ఆసుపత్రిని పరిశీలిస్తున్న ఏసీపీ రమేష్

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 5: విధి నిర్వహణలో ఉన్న వైద్యులు, వైద్య సిబ్బందిపై ఎవరైనా దాడులు చేస్తే కఠిన చర్యలు తప్పవని గోదావరిఖని ఏసీపీ రమేష్ హెచ్చరించారు. గురువారం ప్రభుత్వ జనరల్‌ఆసుపత్రి ఆవరణలోని పోలీస్ అవుట్‌పోస్టు, జనరల్ వార్డు, ఐసీకే కేంద్రం, పిల్లల వార్డులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు, వైద్య సిబ్బంది కోసం రక్షణ చర్యలను పటిష్ఠపరిచినట్టు, ఎవరైనా విధినిర్వహణలో ఉన్న వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మద్యం సేవించి ఎవరైనా ఆసుపత్రికి వస్తే వారికి బ్రీత్ ఎనలైజర్ టెస్టులు నిర్వహించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఆర్ఎంవో అప్పారావు మాట్లాడుతూ వైద్యులపై రోజురోజుకు దాడులు పెరుగుతున్నాయని, అవుట్‌పోస్టులో భద్రత పెంచాలని ఏసీపీకి విజ్ఞప్తి చేశారు. ఇటీవల కొంతమంది మద్యం సేవించి వచ్చి సిబ్బందితో గొడవలకు దిగారని, దీనిపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఏసీపీ వెంట గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఉన్నారు.

## గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడిగా కురుమ సతీష్

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 5: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో గణేష్ ఉత్సవ సమితి అధ్యక్ష కార్యదర్శులను గురువారం శారదానగర్‌లోని స్వర్ణ జయంతి భవన్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కురుమ సతీష్, కార్యదర్శి ఆరెల్లి జలేందర్, కోశాధికారి పారుపల్లి చక్రపాణి ఉత్సవ సమితి ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. ఈ సందర్భంగా వీహెచ్‌పీ విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్ మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో భాగ్యనగర్ తరహాలో ఈ ఏడాది గణేష్ నిమజ్జనాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు ఈసంపల్లి వెంకన్న, మేడగోని రవీందర్, వెంకటస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, మోడెం సురేందర్, ముష్కె సంపత్, బండ సమ్మన్న, పొన్నం అంజయ్య, అడిగొప్పుల రాజు, పైతరి రాజు, లింగన్న, సంపత్, అరవింద్, అనుదీప్, భరత్ పాల్గొన్నారు.

### యైటింక్లయిన్‌కాలనీలో..

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 5: యైటింక్లయిన్ కాలనీ గణేష్ ఉత్సవ కమిటీని ఎన్నుకున్నట్టు కమిటీ అధ్యక్షుడు దావ రాజిరెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కమిటీకి గౌరవ అధ్యక్షులుగా గోవర్థనగిరి జగన్నాథాచార్యులు, సలహాదారులుగా ముత్యాల బాలయ్య, మూకిరి రాజు వ్యవహరించనున్నట్టు తెలిపారు. తొమ్మిది మంది ఉపాధ్యక్షులుగా, ఎనిమిది మంది ప్రధానకార్యదర్శులుగా, 21 మంది కార్యదర్శులు, తిమ్మిది మంది కార్యవర్గ సభ్యులతో కమిటీని ఎన్నుకున్నట్టు రాజిరెడ్డి పేర్కొన్నారు. గణేష్ నవరాత్రులు, నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరిగేలా కమిటీ కృషి చేస్తుందని దావ రాజిరెడ్డి తెలిపారు.

#### మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలి

వినాయక మండపాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గురువారం ఎన్‌పీడీసీఎల్ వెస్ట్‌జోన్ ఏఈకి వినతిపత్రాన్ని అందజేశారు. కాలనీ పరిధిలో ప్రతి ఏటా 90 వరకు వినాయక మండపాలు ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు జరుగుతుంటాయని, వాటికి ఉచిత విద్యుత్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వ భూముల గుర్తింపు

- పెద్దపల్లి ఆర్‌డీవో గంగయ్య



తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఆర్‌డీవో గంగయ్య

సుల్తానాబాద్, సెప్టెంబరు 5: పెద్దపల్లి ప్రాంతంలో భవిష్యత్తులో చేపట్టే వివిధ అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వ భూములను గుర్తించామని ఆర్‌డీవో గంగయ్య తెలిపారు. సుల్తానాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్‌డీవో మాట్లాడుతూ సుల్తానాబాద్ మండలంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించామన్నారు. ఐటీ కారిడార్, ఉద్యోగావకాశాలు కల్పించే సంస్థలు భవిష్యత్తులో రావచ్చనే ఆలోచనతో ముందుగానే ప్రభుత్వ భూముల లభ్యతను పరిశీలించామని చెప్పారు. పెద్దపల్లి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఎలిగేడు మండలంలోని ర్యాకల్దేవ్‌పల్లి సమీపంలో ఇంటిగ్రేటెడ్ గురుకుల విద్యా సంస్థ ఏర్పాటు కోసం కూడా స్థలాన్ని సిద్ధం చేశామన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని సర్వే నంబర్ 779, 229 పరిధిలోని పలు ప్రభుత్వ భూములను చూశామన్నారు. శాస్త్రీనగర్‌లో 228 సర్వే నంబర్‌లోగల స్థలంలో ఐటీకి సంబంధించిన దాన్ని ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే చొరవతో సుల్తానాబాద్ మండలంలో ఇసుక అక్రమ రవాణ తగ్గిందని, నిర్ధేశించిన సమయాల్లో మాత్రమే రవాణా చేయాలని సూచించారు. అలాగే ధరణి సమస్యలు కూడా చాలా వరకు తగ్గాయని పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించామన్నారు. డివిజన్‌లోని చెరువులు, కుంటల ఆక్రమణలు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ వంటి అంశాలపై కూడా మండల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని, ఎక్కడ ఆక్రమణలకు గురైనా రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే విభాగం వారు జాయింట్‌గా నిర్ధారించాల్సి ఉంటుందన్నారు. ఆర్‌డీవో వెంట తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

## కొంరయ్యకు ఏఐటీయూసీ శ్రేణుల నివాళులు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 5: దివంగత ఏఐటీయూసీ నాయకుడు మనుబోతుల కొంరయ్య వర్ధంతిని పురస్కరించుకుని గురువారం ఆర్జీ-2ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్లపై యూనియన్ నాయకులు ఆయనకు నివాళులు అర్పించారు. సింగరేణి బీఐఎఫ్ఆర్‌లోకి వెళ్లినపుడు కార్మికులకు నచ్చజెప్పి కంపెనీని లాభాల్లోకి తీసుకురావడంలో కొంరయ్య కీలకపాత్ర పోషించినట్టు నాయకులు పేర్కొన్నారు. యూనియన్ ప్రారంభం నుంచి మరణించే వరకు కార్మికుల హక్కుల కోసం పోరాడిన నాయకుడన్నారు. ఐదవ వేజ్‌బోర్డు వరకు పర్మినెంట్ మెంబర్‌గా ఉండి ఇంక్రిమెంట్లు, అలవెన్సులు ఇప్పించిన ఘనత కొంరయ్యకు దక్కుతుందని, కోల్‌ఇండియాలో అమలువుతున్న పెన్షన్‌ను సింగరేణి కార్మికులకు కొట్లాడి ఇప్పించినట్టు తెలిపారు. కార్యక్రమాల్లో ఎల్ ప్రకాష్, రాజారత్నం, జీ రవీందర్, అన్నారావు, శ్యాంసన్, సాంబశివరావు, బుర్రతిరుపతి, మహేందర్, సంపత్, రవికుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులతో ఎమ్మెల్యేలు, కలెక్టర్, అదనపు కలెక్టర్లు

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 5 : విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపుకలెక్టర్లు జె అరుణశ్రీ, జీ శ్యాంప్రసాద్‌లాల్‌లతో కలిసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ తాను ఇంతగా ఎదగడానికి గురువులు నేర్పిన విద్యాబుద్ధుల కారణమని, వారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతి హోదా వరకు ఎదిగిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించుకుంటున్నామని తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను గుర్తించి వారిని సన్మానించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఉపాధ్యాయ అవార్డు వచ్చిన ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని అన్నారు. ఉపాధ్యాయులు తన పాఠశాల.. తన విద్యార్థులు అన్న భావనతో పనిచేసినప్పుడు విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపడుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు 1200 కోట్ల రూపాయలు వెచ్చించిందని అన్నారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నందున బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య మెరుగుపరిచే విధంగా చర్యలు చేపట్టాలని, పాఠశాలలో ఎలాంటి అవసరాలు ఉన్న ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. సింగరేణి ద్వారా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరానికి నోట్ బుక్స్ అందించడం జరుగుతుందని అన్నారు. మహిళ ప్రభుత్వ జూనియర్ కళాశాలను రెండు కోట్ల రూపాయలతో మరమ్మతులు చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేస్తున్నామని పెద్దపల్లి ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు తీసుకుంటున్న ఉపాధ్యాయులు, జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల అందరినీ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అభినందించారు. జిల్లాలో ఉపాధ్యాయులు చాలా బాగా పనిచేస్తున్నారని, అదేవిధంగా మునుముందు కూడా ఇలానే పనిచేయాలని కోరారు. జిల్లా యంత్రాంగం ద్వారా పాఠశాలకు కావలసిన మౌలిక వసతులు కల్పించగలం కానీ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారి విద్యా సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్న తీరు ప్రశంసనీయమని అన్నారు.

అనంతరం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ దేశంలో ప్రతిఒక్క వ్యక్తి చదువు కోవాలన్నారు. చదువులో రాణించాలని, అత్యున్నత స్థాయిలో దేశాన్ని నడిపించాలని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయమని ఆయన అన్నారు. ఉపాధ్యాయులు తమ వృత్తిలో రాణించాలంటే వృత్తిపట్ల శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే విధంగా విద్యాబోధన చేయాలని సూచించారు. విద్యార్థులకు చిన్న వయసు నుంచి మంచి అలవాట్లు నేర్పించాలని అన్నారు. నూతన విధానంలో విద్యాబోధన చేయాలని, చదువుతోపాటు క్రీడల్లో సైతం విద్యార్థులు పాల్గొనే దిశగా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని అన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన 42 మంది ఉపాధ్యాయులకు ముఖ్య అతిథులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి వీహనుమంతు, ఏసీజీఈ ఎం. రామ్‌రెడ్డి, సమగ్ర శిక్ష సమన్వయకర్త పీఎం షేక్, ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పిడుగు కృష్ణ

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 5: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా గోదావరిఖనికి చెందిన పిడుగు కృష్ణను నియమిస్తూ గురువారం రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ సందర్భంగా పిడుగు కృష్ణ మాట్లాడుతూ ఓబీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పథకాలను ఓబీసీలకు అందే విధంగా కృషి చేస్తానని, తెలిపారు. రిజర్వేషన్ అమలు కోసం కృషి చేస్తానని తెలిపారు. తన నియామకం కోసం కృషి చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్, ఎస్‌సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్, జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

### గొర్రెల పెంపకంపై అవగాహన

జూలపల్లి, సెప్టెంబరు 5 : మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన గొర్రెల పెంపకందారులకు మండల కేంద్రంలో గురువారం సంబంధిత అధికారులు అవగాహన కల్పించారు. గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల ఏర్పాటుకు సంబంధించిన పలు అంశాలను వారికి వివరించారు. అలాగే గొర్రెల్లో వచ్చేవ్యాధులు, వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, టీకాలు, మందులు వాడే విధానం, మందుల మోతాదు పలు వివరాలను ఈ సందర్భంగా పశువైద్యులు డాక్టర్ అజారొద్దిన్ గొర్రెల పెంపకందారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారం తిరుపతి యాదవ్, కొమ్మ ఐలయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ధాన్యం రవాణా టెండర్లలో వివాదం..

- టెండర్ పత్రాలను లాక్కెళ్లిన కొందరు వ్యక్తులు - ఇరువర్గాల మధ్య గొడవ - పోలీసు కేసు పెడతామన్న డీఎం

పెద్దపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని రైస్ మిల్లులకు, గన్నీ సంచులను కేంద్రాలకు రవాణా చేసేందుకు నిర్వహించిన టెండర్ల వద్ద వివాదం జరిగింది. రామగుండం సెక్టార్‌లో రవాణా కోసం టెండర్ పత్రాలను పౌరసరఫరాల సంస్థ మేనేజర్‌కు దాఖలు చేసేందుకు వచ్చిన ఒక కాంట్రాక్టర్ నుంచి కొందరు పత్రాలను లాక్కుని వెళ్లడంతో వివాదం మొదలయ్యింది. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్నది. ఈ వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేసే కేంద్రాల నుంచి ధాన్యాన్ని రైస్ మిల్లులకు రవాణా చేసేందుకు, గన్నీ సంచులను పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని, రామగుండం సెక్టార్లలో రవాణా చేసేందుకు జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారులు గతనెల 23న ఆన్‌లైన్ టెండర్లను ఆహ్వానించారు. ఈనెల 5న సాయంత్రం 4 గంటల వరకు ఆన్‌లైన్‌లో టెండర్ దాఖలు చేసి హార్డుకాపీలను జిల్లా కార్యాలయంలో అందజేయాలని టెండర్ ప్రకటనలో పేర్కొన్నారు. కాంట్రాక్టర్లు అందరు చివరి రోజైన గురువారం కలెక్టరేట్‌లోని కార్యాలయంలో దాఖలు చేసేందుకు వచ్చారు. పెద్దపల్లి సెక్టార్‌లో సన్‌రైజర్ ట్రాన్స్‌పోర్ట్ నుంచి ఒక టెండర్ దాఖలు కాగా, సుల్తానాబాద్ సెక్టార్‌లో ఎస్ఆర్ ట్రాన్స్‌పోర్ట్, రామసేతు ఎంటర్‌ప్రైజెస్ నుంచి 2 టెండర్లు, మంథని సెక్టార్‌లో సయ్యద్ అండ్‌సన్స్ శ్రీ విజయదుర్గ ట్రాన్స్‌పోర్టు 2 టెండర్లు, రామగుండం సెక్టార్‌లో రామగుండం లారీ అసోసియేషన్ నుంచి టెండర్ దాఖలు అయ్యింది. ఇదే సెక్టార్‌లో సాయిరాం లారీ ట్రాన్స్‌పోర్ట్ నుంచి ఆన్‌లైన్‌లో టెండర్ దాఖలు చేసిన కాటారంనకు చెందిన లక్ష్మణ్ కుమార్ పత్రాలను తీసుకుని పౌరసరఫరాల సంస్థ అధికారి కార్యాలయానికి వచ్చి డీఎంకు పత్రాలు అందజేస్తుండగా, కొందరు టెండర్ పత్రాలను లాక్కొని వెళ్లడంతో వివాదం మొదలయ్యింది. కార్యాలయం బయట ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. లాక్కెళ్లిన పత్రాలను తిరిగి ఇవ్వాలని డీఎం శ్రీకాంత్‌రెడ్డి రామగుండం లారీ అసోసియేషన్ నాయకులకు చెప్పినా ఇవ్వలేదు. టెండర్ సమయం ముగుస్తుండగా మరొక గంట సమయం ఇచ్చినా కూడా పత్రాలు ఇవ్వలేదు. దీంతో గొడవ జరగకుండా ఉండేందుకు డీఎం పోలీసులను పిలిపించారు. సాయంత్రం 5 గంటల వరకు కూడా లాక్కెళ్లిన పత్రాలు ఇవ్వకపోవడంతో మరొక సెట్ టెండర్ పత్రాలను అందజేస్తే, పరిగణనలోకి తీసుకుంటామని లక్ష్మణ్‌కుమార్‌కు డీఎం చెప్పారు.



కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న సివిల్ సప్లయ్ డీఎం

ఈ విషయమై డీఎం శ్రీకాంత్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కాంట్రాక్టర్ చేతిలో నుంచి టెండర్ పత్రాలను లాక్కెళ్లిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం టెండర్లను ఓపెన్ చేసి తక్కువ కోట్ చేసిన వారికి ఖరారు చేయనున్నామని తెలిపారు.

## కోతి దాడిలో ఒకరికి గాయాలు

శంకరపట్నం, సెప్టెంబరు 5: మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన బొజ్జ కొంరయ్యపై కోతులు దాడి చేసి గాయపరిచాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంరయ్య కొన్ని రోజుల నుంచి పక్షవాతంతో బాధపడుతున్నాడు. వైద్యుల సూచనల మేరకు ఫిజియోథెరపీ చేస్తున్నారు. గురువారం ఇంటి బయట వరండా మీద ఫిజియోథెరపీ చేసే క్రమంలో కోతుల గుంపు దాడి చేసింది. గాయపడిన కొంరయ్యను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు.

## హోటళ్లను తనిఖీ చేసిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్

● కాలంచెల్లిన తినుబండారాల గుర్తింపు

కొడిమ్యాల, సెప్టెంబరు 5: మండల కేంద్రంలోని ఐదు హోటళ్లను గురు వారం జగిత్యాల ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.అనూష తనిఖీ చేశారు. కాలంచెల్లిన కూల్ డ్రింక్స్, తిను బండారాలను గుర్తించి వాటిని బయట పడేయించారు. తినుబండారాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలన్నారు. కాలం చెల్లిన వాటిని అమ్మకానికి పెడితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలో సిబ్బంది ఉన్నారు.



కాలం చెల్లిన కూల్ డ్రింక్ పారపోస్తున్న సిబ్బంది

# జోరుగా రేషన్ బియ్యం దందా

● గ్రామాల్లో అక్రమంగా కొనుగోళ్లు

మల్యాల, సెప్టెంబరు 5: పేదల కడుపునింపడానికి ప్రభుత్వాలు అందజేస్తున్న రేషన్‌బియ్యం పక్కదారి పడుతోంది. చౌకధరల దుకాణాల ద్వారా నాలుగేళ్లుగా ఉచితంగా అందిస్తున్న బియ్యం కొందరు అక్రమంగా కొనుగోలు చేస్తున్నారు. ఈ తతంగం మండలంలో కొన్నేళ్లుగా సాగుతున్నప్పటికీ అధికారులు నిమ్మకుండిపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రతి నెల మొదటి వారంలో రేషన్ దుకాణాలలో ఆహారభద్రత కార్డుల ద్వారా బియ్యం పంపిణీ చేస్తుండగా అదే రోజు నుంచి కొందరు వ్యక్తులు కొనుగోళ్లు చేస్తున్నారు. కొందరు బినామీలు బృందాలను ఏర్పాటు చేసుకొని కొనుగోళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ద్విచక్రవాహనాలపై ఇంటింటా తిరుగుతూ కిలో బియ్యానికి రూ.10నుంచి 15వరకు చెల్లిస్తున్నారు. కొన్నాళ్ల క్రితం గుట్టుచప్పుడు కాకుండా కొనుగోళ్లు చేసిన వ్యక్తులు ఇప్పుడు నేరుగా బియ్యం కొనడం.. తాము ప్రతి నెలా సంబంధిత అధికారులకు మాముళ్లు చెల్లిస్తున్నట్లు పేర్కొంటున్నారు. అందుకే యథేచ్ఛగా కొనుగోళ్లు చేస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో కొందరిని పోలీసులు పట్టుకొని కేసులు నమోదు చేసినప్పటికీ దందా సాగుతోంది.

● రేషన్‌దుకాణాల వద్దే కొనుగోళ్లు

బియ్యంను రేషన్‌దుకాణాల వద్ద లబ్ధిదారులకు పంపిణీ చేస్తుండగా అక్రమంగా కొనుగోళ్లు చేసే వ్యక్తులు పంపిణీ రోజుల్లో అక్కడే మకాం వేస్తున్నారు. లబ్ధిదారుల వద్ద క్వింటాళ్ల కొద్ది అక్కడే కొనుగోలు చేసి కొండగట్టు తదితర ప్రాంతాల్లో నిలువ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. అక్కడి నుంచి వ్యాపారులు కొందరు పెద్ద వ్యాపారులకు రూ.20కి అప్పజెప్పుతుండగా మహారాష్ట్రకు తరలించి కిలోకి రూ.25-30వరకు విక్రయిస్తున్నట్లు గ్రామాల్లో కొనుగోలు చేసే వ్యక్తులు తెలుపుతున్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యంలో సగానికిపైగా అక్రమంగా తరలిస్తున్నారని జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



గ్రామంలో ద్విచక్రవాహనంపై బియ్యం తరలింపు

## కోర్టు ఆదేశాలతో షటర్లు, ప్రహరీ కూల్చివేత

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 5: సిరిసిల్ల పట్టణం గాంధీనగర్‌లో అక్రమంగా సెల్లార్లలో షెటర్లు నిర్మించారని కొందరు కోర్టుకు వెల్లగా కోర్టు ఆదేశాల మేరకు గురువారం మున్సిపల్ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో భవనం సెల్లార్లలో నిర్మించిన షెటర్లు, ప్రహరీని కూల్చి వేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్‌కు సబంధించిన భవనం సెలార్లలో షెటర్లు, భవనం పడమర వైపు బాత్‌రూంలు కట్టడంతో ఓ న్యాయవాది కోర్టుకు వెళ్లారు. బాత్‌రూం షెటర్లు, ప్రహరీని తొలగించాలని కోర్టు ఆదేశించడంతో మున్సిపల్ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో పాక్షికంగా కూల్చి వేశారు.



సెల్లార్‌లోని షెటర్లను తొలగిస్తున్న జేసీబీ

### నామమాత్రంగా కూల్చారు : బీజేపీ

మున్సిపల్ వైస్‌చైర్మన్‌కు సంబంధించిన భవన సెల్లార్‌లోని బాత్‌రూం, షెటర్లు, ప్రహరీని కూల్చాలని కోర్టు ఆర్డర్ ఇచ్చినా మున్సిపల్ అధికారులు తూతూ మంత్రంగా కూల్చారని బీజేపీ నాయకులు ఆరోపించారు. భవనం పడమర వైపు ఉన్న సెల్లార్లో నిబంధనలకు విరుద్ధంగా బాత్‌రూంలు నిర్మించారని కోర్టుకు ఓ న్యాయవాది వెళ్లగా వాటిని తొలగించాలని కోర్టు ఆర్డర్ ఇచ్చిన వాటిని మాత్రం మున్సిపల్ అధికారులు కూల్చలేదని ఆరోపించారు. 24 గంటల్లో కోర్టు ఆర్డర్ ప్రకారం మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోతే బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు.

## ఎదురెదురుగా ఢీకొన్న ద్విచక్రవాహనాలు

● ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 5: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ -రగుడు ప్రధాన రహదారిపై గురువారం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో జగిత్యాల, తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేట గ్రామాలకు చెందిన తాటి సంతోష్, సతీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. జగిత్యాలకు చెందిన తాటి సంతోష్ తన బైక్‌పై వెంకటాపూర్ నుంచి రగుడు వైపునకు వెళుతున్నాడు. గండిలచ్చపేటకు చెందిన సతీష్ తన ద్విచక్ర వాహనంపై అతని భార్యతో కలిసి రగుడు నుంచి వెంకటాపూర్‌కు వస్తున్నాడు. రెండు బైక్‌లు ఎదురెదురుగా అతి వేగంగా ఢీకొన్నాయి. ప్రమాదంలో సంతోష్, సతీష్ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంతోష్‌కు తీవ్ర గాయాలుకావడంతో పరిస్థితి విషమంగా మారింది.

### జ్వరంతో ఒకరి మృతి

రుద్రంగి, సెప్టెంబరు 5: రాజన్నసిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రానికి చెందిన నోముల రవి (52) అనే వ్యక్తి జ్వరంతో గురువారం మృతి చెందాడు. నోముల రవి 10 రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం వేములవాడ తీసుకువేళ్లే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడని మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

# లంచం ఇవ్వనందుకు ఉద్యోగం నుంచి తీసేశారు

● ఎంపీడీవో కార్యాలయం ఎదుట మహిళా అటెండర్ నిరసన

గన్నేరువరం, సెప్టెంబరు 5: ఉద్యోగంలో కొనసాగాలంటే లంచం ఇవ్వాలని అధికారులు వేధిస్తున్నారని ఆరోపిస్తూ గన్నేరువరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న ఎడ్ల లక్ష్మి గురువారం పురుగుల మందు డబ్బా పట్టుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ ఎనిమిది సంవత్సరాలుగా తాను అటెండర్‌గా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నానని, ఇపుడు జీతం పెరగడంతో ఎంపీడీవో తీగల శంకర్, ఏపీవో స్వాతి రూ. 40 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారన్నారు. లంచం ఇవ్వనందుకు తనను ఉద్యోగం నుంచి తీసేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను నిరుపేదనని, డబ్బులు ఇవ్వలేనని వేడుకున్నప్పటికీ ఉద్యోగానికి రావద్దని నెల రోజులుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి లంచం అడిగిన అధికారులపై చర్యలు తీసుకొని తన ఉద్యోగాన్ని ఇప్పించాలని వేడుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని లక్ష్మికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించింది.



పురుగుల మందు డబ్బాతో నిరసన తెలుపుతున్న ఎడ్ల లక్ష్మి

## వరదకాలువలో వృద్ధురాలి మృతదేహం లభ్యం

రామడుగు, సెప్టెంబర్ 5 : మండలంలోని షానగర్‌లోని వరద కాలువలో గురువారం వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాల మండలం రామన్నపేట గ్రామానికి చెందిన పుల్లెల వెంకటమ్మ(82) ఈ నెల 3న ఇంటి నుంచి బయటికి వెళ్లింది. షానగర్ గ్రామానికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. షానగర్‌లోని వరద కాలువ వద్ద గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ఉదయం వరద కాలువలో వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వయోభారంతో అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి కుమారుడు పుల్లెల శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

వేములవాడ టౌన్, సెప్టెంబరు 5: ద్విచక్రవాహనం, బులెరో వాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన వేములవాడ నంది కమాన్ సమీపంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాలరామన్నపల్లి గ్రామానికి చెందిన కదురు నరేష్ అనే వ్యక్తి తన బంధువు అయిన తంగళపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన హర్షవర్ధన్ అనే బాలుడుతో కలిసి ద్విచక్రవాహనంపై సిరిసిల్ల వైపు వెళ్తున్నారు. ఇదే క్రమంలో బులెరో వాహనం, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో నరేష్, హర్షవర్ధన్‌కు తీవ్రగాయాలయ్యాయి. హర్షవర్ధన్ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైద్రాబాద్ తరలించినట్లు తెలిపారు.

### ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

| ప్రాజెక్టు | ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో) | పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో) | ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో) |
|---|---|---|---|---|
| శ్రీరాంసాగర్ | 74,837 | 8,867 | 80.5 | 74.837 |
| ఎల్లంపల్లి | 1,65,579 | 1,02,496 | 20.175 | 16.463 |
| మిడ్ మానేరు | 16,550 | 6,400 | 27.54 | 22.804 |
| ఎల్ఎండీ | 7,546 | 290 | 24.034 | 19.76 |
| ఎగువమానేరు | 27,500 | ------ | 2.00 | 2.00 |

# శ్రీరాంసాగర్ వరద గేట్లు మూసివేత

● ప్రాజెక్టులకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టడంతో గురువారం శ్రీరాంసాగర్ వరద గేట్లను అధికారులు మూసివేశారు. నాలుగు, అయిదు రోజులుగా ప్రాజెక్టుకు చెందిన 41 వరద గేట్లను పైకి ఎత్తి గోదావరిలోకి నీటిని వదులుతున్నారు. క్రమక్రమంగా వరద రావడం తగ్గుముఖం పట్టడంతో ఉదయం 8 గంటలకు ప్రాజెక్టుకు చెందిన వరద గేట్లన్నింటినీ మూసివేశారు. వరద కాలువకు సైతం నీటిని వదలడాన్ని క్రమక్రమంగా తగ్గించారు. ఎస్సారెస్పీలోకి 74,837 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 74.837 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 8,867 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

### శ్రీపాద ఎల్లంపల్లికి కొనసాగుతున్న వరద

పెద్దపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద కొనసాగుతున్నది. గురువారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 1,65,579 క్యూసెక్కుల వరద నీరు ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వస్తున్నది. దిగువకు 20 గేట్ల ద్వారా 1,02,496 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలి పెడుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 16.4 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

### మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బోయినపల్లి/ఇల్లంతకుంట: శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి 15,000 క్యూసెక్కులు మూల వాగునుంచి, మానేరు వాగు ద్వారా 1,550 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఎల్ఎండీకి నీటి విడుదలను నిలిపివేయగా, అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 316.07 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 22.804 టీఎంసీల మేరకు చేరుకొంది. ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 3.5 టీఎంసీల సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 2.96 టీఎంసీలకు చేరుకుంది. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి ఎగువన ఉన్న సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్‌కు 6,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



ఎస్సారెస్పీ ప్రాజెక్టు



ధర్మపురిలో స్నానఘట్టాల వద్ద గోదావరి ప్రవాహం

### 20 టీఎంసీలకు చేరువలో ఎల్ఎండీ



ఎల్ఎండీ రిజర్వాయర్‌లో నీరు

తిమ్మాపూర్: నిరంతరంగా కురుస్తున్న వర్షాల కారణంగా కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం 20 టీఎంసీల నీటి మట్టానికి చేరుకుంది. ఎల్ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసిలకు 19.76టీఎంసిల నీరు ఉంది. వర్షం తగ్గుముఖం పట్టడంతో మోయ తుమ్మెద వాగు ఉధృతి తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం ఎల్ఎండిలోకి మోయతుమ్మెద వాగు నుంచి 5,715క్యూసెక్కులు, ఎగువ ఎల్ఎండి నుంచి 1831క్యూసెక్కులు మొత్తం 7,546క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా, ఔవుట్ ఫ్లో 290క్యూసెక్కులు ఉంది. ఎంఎంఆర్ నుండి ఎల్ఎండిలోని వస్తున్న ఇన్‌ఫ్లోలను గురువారం నిలిపివేశారు.

### ధర్మపురి వద్ద ఉధృతంగా గోదావరి ప్రవాహం

ధర్మపురి : ధర్మపురి వద్ద గోదావరి నది నీటి ప్రవాహం గురువారం సాయంత్రం వేగంగా కొనసాగింది. గోదావరి నీటి మట్టం క్షణ క్షణం పెరిగి వేగంగా ప్రవహించింది. స్నానఘట్టాలు నీటిలో మునిగి పోయాయి. భక్తులను లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయకుండా అధికారులు అప్రమత్తం చేశారు. తహసీల్దార్ కృష్ణచైతన్య, సీఐ రాంనర్సింహారెడ్డి, వరద పరిస్థితి గురించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

### యువకుడి ఆత్మహత్య



ప్రవీణ్(ఫైల్)

సైదాపూర్, సెప్టెంబరు 5: సైదాపూర్ మండలంలోని బొత్తలపల్లి గ్రామానికి చెందిన మెడవేణి ప్రవీణ్(25) అనే యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రవీణ్ కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు చూసే సరికి ప్రవీణ్ మృతి చెంది ఉన్నాడు. మృతుడి తండ్రి రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

### రాజన్న భక్తురాలి ఆకస్మిక మృతి

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 5: కుటుంబ సమేతంగా రాజన్న దర్శనానికి వచ్చిన కొత్తకొండ విజయ (52) అనే భక్తురాలు గురువారం మృతి చెందారు. రాజన్న దర్శనానికి వచ్చి దర్శించుకుని గదిలోకి వెళ్లే క్రమంలో ఆలయ పరిసర ప్రాంతంలో ఒక్కసారిగా కుప్పకూలింది. వెంటనే బంధువులు వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విజయ రాజన్న దర్శనం కోసం కుటుంబసమేతంగా వచ్చారు. మృతురాలది సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం చోటపల్లి గ్రామం అని తెలిపారు.

## అధికారులు, ప్రజాప్రతినిధుల ఫోన్లు ట్యాపింగ్

● హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 5: అధికారులు, ప్రజాప్రతినిధుల ఫోన్లు ట్యాప్ చేస్తున్నారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. గురువారం జమ్మికుంట పట్టణంలోని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు నివాసంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ తనతో పాటు కరీంనగర్ సీపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, అధికారుల ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారని ఆరోపించారు. మానకొండూర్ శాసనసభ్యుడు మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంట్లో ఒక ఇంటర్వ్యూ ఇచ్చాడని, అందులో మానకొండూర్ సీఐకి సీపీ టెలీకాన్ఫరెన్స్ రావడం లేదని, సీఐతో సీపీ మాట్లాడటం లేదని చెప్పారన్నారు. టెలీకాన్ఫరెన్స్ అనేది ఒక ఇంటర్నల్ విషయమని, అలాంటి విషయం ఎమ్మెల్యేకు ఎలా తెలిసిందో సమాధానం చెప్పాలన్నారు. జిల్లాలోని అందరి అధికారుల ఫోన్లు ట్యాప్ అవుతున్నాయన్నారు. ఒక ఐపీఎస్ ఫోన్ ట్యాప్ చేసినపుడు ఎమ్మెల్యేల ఫోన్ ట్యాపింగ్ చేయడం లేదని గ్యారంటీ ఏమిటని ప్రశ్నించారు. తాము పోస్టింగ్‌లు ఇప్పిస్తే సీపీ తీసుకోవడం లేదని ఎమ్మెల్యే చెబుతున్నారన్నారు. ముఖ్యమంత్రి పైరవీలకు తావు లేదని చెప్పాడని, అలాంటపుడు పోస్టింగ్‌లు ఎలా ఇప్పిస్తున్నారో చెప్పాలన్నారు. ఓడిపోయిన వ్యక్తి ఇక్కడ చెక్కులు పంచుతున్నాడన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన ఏ చెక్కు అయినా పంపిణీ చేసేందుకు ఎమ్మెల్యేలకు హక్కు ఉంటుందన్నారు. అవసరమైతే తాను మళ్లీ వెళ్తా అన్నారు. సీపీ ఫోన్ ట్యాపింగ్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ స్పందించి సీబీఐ విచారణ చేపట్టాలన్నారు. రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ జరుగలేదని, కేవలం 40శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని గుర్తు చేశారు. సమావేశంలో సొసైటీ చైర్మన్ పొనగంటి సంపత్, మాజీ మున్సిపల్ చైర్మన్ పోడేటి రామస్వామి, టంగుటూరి రాజ్‌కుమార్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

### ప్రైవేట్ ఉపాధ్యాయుల సంక్షేమ బిల్లు ప్రవేశపెట్టాలి

● యాదగిరి శేఖర్ రావు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 5: ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుల సంక్షేమ బిల్లును వెంటనే పార్లమెంట్, అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని ట్రస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయులకు 10 లక్షల రూపాయల ఆరోగ్య బీమా, మరో 10 లక్షల రూపాయల జీవిత బీమాను ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం 10వ తరగతిలో 10/10 జీపీఏ సాధించే విద్యార్థుల్లో 90శాతం విద్యార్థులు బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలల్లో నుంచి వస్తున్నారని అన్నారు. భావి భారత పౌరులను దేశానికి అందిస్తున్నది కూడా బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలేనన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులను ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా గౌరవించి సముచిత స్థానం ఇవ్వాలని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శేఖర్‌రావు ప్రభుత్వాన్ని కోరారు.

### ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 5: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారు మైసమ్మ చెరువు సమీపంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు గురువారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామని ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ 14,970 నగదుతో పాటు పేకాటకు సంబంధించిన సామగ్రిని స్వాధీన పర్చుకున్నామని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

### గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకుల రిమాండ్

● 150 గ్రాముల గంజాయి స్వాధీనం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 5: మండలంలోని నారాయణపూర్ గ్రామ శివారులో గంజాయి విక్రయించేందుకు వచ్చిన కరీంనగర్ జిల్లా గంగాధర మండల కేంద్రానికి చెందిన యువకులు అఖిల్, ఖాసీంలను పట్టుకుని రిమాండ్‌కు తరలించామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ గురువారం తెలిపారు. నారాయణపూర్ గ్రామ శివారులో ఈ నెల 4న ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు వాహన తనిఖీలను చేపట్టారని పేర్కొన్నారు. ఇద్దరు యువకులు బైక్‌పై అనుమానస్పదంగా సంచరిస్తుండగా పట్టుకుని విచారించామని చెప్పారు. వారి వద్ద నుంచి 150 గ్రాముల ఎండు గంజాయితో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనపర్చుకున్నామని పేర్కొన్నారు. అఖిల్, ఖాసీంలు గంజాయికి అలవాటు పడి గంగాధర మండలం కాశిరెడ్డిపల్లి గ్రామంలోని యువకుడు మధు వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల ప్రాంతాల్లో విక్రయిస్తున్నారని తమ విచారణలో అంగీకరించారని తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. ఎవరైనా గంజాయి అమ్మినా, సేవించినా తమకు సమాచారం అందిస్తే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో రైతుకు తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 5: ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన రైతు మారెల్లి నాగరాజు తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని ఓ ప్రైవేటు వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి తీవ్రంగా మారింది. గ్రామంలోని రైతు మారెళ్లి నాగరాజు తనకున్న వ్యవసాయ పొలం వద్ద నుంచి పాడిగేదెలను పశువుల పాక వద్దకు ప్రధాన రహదారి పక్క నుంచి తీసుకెళుతున్నాడు. ఎల్లారెడ్డిపేట నుంచి గొల్లపల్లి వైపుకు వెళ్తున్న ఆటో అతివేగంగా నాగరాజును వెనుక నుంచి ఢీకొట్టింది. దాంతో ఆయన ఎగిరి రోడ్డుపై ఉన్న డివైడర్‌పై పడ్డాడు. తలకు బలమైన గాయాలవడం వల్ల పరిస్థితి తీవ్రంగా ఉందని వైద్యులు పేర్కొన్నారని కుటుంబ సభ్యులు, స్థానికులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

### రాజన్న ఆలయంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు

శనివారం కల్యాణం, అభిషేకం పూజల రద్దు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 5: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం నుంచి 15వ తేదీ ఆదివారం వరకు గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం వినాయక చవితి సందర్భంగా ఆలయ నాగిరెడ్డి మండపంలో ఉదయం 9.05 గంటలకు పుణ్యాహవాచనము, అఖండ దీపారాదన, సిద్ధి బుద్ధి వినాయక ప్రతిష్ఠ నిర్వహిస్తామన్నారు. వినాయక చవితి రోజున సాయంత్రం 4 గంటలకు శమంతకోపాఖ్యానము చేపట్టనున్నారు. 14వ తేదీన భాద్రపద శుద్ధ ఏకాదశి శనివారం రోజున ఉదయం 9 గంటలకు మహాగణపతి మూలమంత్ర హవనము, సాయంత్రం 7.15 గంటలకు లక్ష్మీగణపతి స్వామి వారికి మహాపూజ, 15వ తేదీన భాద్రపద శుద్ధ ద్వాదశి ఆదివారం రోజున హవనానంతరం ఉదయం 11 గంటలకు పూర్ణాహుతి, రాత్రి 7.15 గంటలకు పెద్దసేవ ఊరేగింపు అనంతరం గణేశ నిమజ్జనం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కాగా వినాయక చవితి సందర్భంగా శనివారం రాజన్న ఆలయంలో నిర్వహించే కల్యాణాలు, అభిషేకాలు రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

### రేషన్ బియ్యం పట్టివేత

బీర్‌పూర్,సెప్టెంబరు 5: మండలంలోని తుంగూర్ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని శుక్రవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీర్‌పూర్ మండలకేంద్రానికి చెందిన కోట సంతోష్ అనే వ్యక్తి ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసే బియ్యాన్ని కొనుగోలు చేసి తుంగూర్ గ్రామంలో అక్రమంగా నిల్వచేసి తరలించడానికి సిద్ధంగా ఉంచాడు. పోలీసులకు అందిన సమాచారంతో సోదాలు నిర్వహించి 5.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి నిందితుడు సంతోష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు.

### దంపతుల మధ్య మనస్పర్థలు

● అత్తగారింటిలో వివాహిత బైఠాయింపు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 5: భార్యభర్తల మధ్య మనస్పర్థల వల్ల కొంతకాలంగా విడివిడిగా ఉంటుంటగా, భార్య నుంచి విడాకులు కావాలని భర్త కోర్టును ఆశ్రయించడంతో పుట్టింటి నుంచి చేరుకున్న వివాహిత అత్తగారింటిలో బైఠాయించింది. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు. గ్రామంలోని ఆంజనేయులుకు బోయినపల్లి మండలం బూరుగుపల్లికి చెందిన కల్యాణితో వివాహమైంది. కొంత కాలం సజావుగా సాగిన వారి కాపురంలో గొడవలు నెలకొన్నాయి. దాంతో కల్యాణి నాలుగేళ్ల కిందట పుట్టింటికి వెళ్లింది. పలుమార్లు పెద్దలు పంచాయితీ నిర్వహించి కలిసి ఉండాలని సూచించినా ఫలితం లేకుండాపోయింది. భార్యాభర్తల మధ్య నెలకొన్న గొడవలతో కోర్టులో కేసు కొనసాగుతోంది. ఈ క్రమంలో భర్త ఆంజనేయులు తన భార్య నుంచి విడాకులు కావాలని నోటీసులు పంపించడంతో కల్యాణి పుట్టింటి నుంచి వెంకటాపూర్‌లోని అత్తగారింటికి చేరుకుంది. తాను ఇక్కడే ఉంటానని భీష్మించుకు కూర్చుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. గొడవలు చోటు చేసుకోకుండా ఇరువర్గాలకు నచ్చజెప్పారు.

## రాష్ట్రంలో హైడ్రా పేరుతో డ్రామా నడుస్తోంది..

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 5 : రాష్ట్రంలో హైడ్రా పేరుతో డ్రామా నడుస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పెద్దబొంకూరు గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.. 90 ఏళ్ల క్రితం నైజాం పాలనలో సర్వే నంబర్ల వారీగా సమగ్ర సర్వే నిర్వహించారని, అప్పటి నుంచి నేటివరకు ఆ విధంగా సర్వేలు నిర్వహించలేదన్నారు. రెవెన్యూ చట్టంలో మొదటి ఎజెండాగా సర్వే నంబర్ల వారీగా సర్వే నిర్వహించాలని ఉందని, ఈ విషయంపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పలుమార్లు విజ్ఞప్తి చేశామన్నారు. ఆయన పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి కూడా భూ కమిటీని వేశారని, కమిటీ సభ్యులను కలిసి సర్వే విషయమై వినతిపత్రం అందించామన్నారు. రికార్డులు సరిచేస్తామని చెప్పడమే తప్ప చేపట్టడం లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న హైడ్రాను రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమలుచేయాలన్నారు. అక్రమ కట్టడాల్లో ప్రధానంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులే ఉన్నారని, వారి నుంచి కొంతమంది ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఎన్నికయ్యారన్నారు. సర్వే నంబర్ల వారీగా సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని, దీంతో అక్కడ నిర్మించిన కట్టడం అక్రమమని తేలితే ఆధారాలతో కూల్చేస్తే బాగుంటుందన్నారు. ప్రభుత్వ భూములు, చెరువుశిఖం, నాలా వంటి భూములను ఆక్రమిస్తున్నారని, వీటిపై సమగ్ర విచారణ జరిపించాలని, అందులో కూడా పేద కుటుంబాలు ఉంటాయని వారికి ప్రత్యామ్నాయంగా ఇళ్లు కట్టించాలన్నారు. 2లక్షల రుణమాఫీ విషయంలో ప్రతి రైతుకు వర్తింపజేయాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, సహాయ కార్యదర్శి గోషిక మోహన్, గౌతం గోవర్ధన్, మడికోండ ఒడెమ్మ, పోడం స్వామి, సూర్య పాల్గొన్నారు.



పెద్దబొంకూరులో విలేకరులతో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

### సైబర్‌క్రైం కేసు నమోదు

బోయినపల్లి, సెప్టెంబర్ 5: ఓ వ్యక్తికి చెందిన కరెంట్ ఆకౌంట్ సిమ్ కార్డు తీసుకొని ఎక్కువ మొత్తంలో బ్యాంక్ ద్వారా లావాదేవీలు జరిపిన సంఘటనపై ఖాతాదారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గురువారం బోయినపల్లి ఎస్ఐ పృథ్వీధర్ గౌడ్ తెలిపారు. వివరాల ప్రకారం నీలోజిపల్లి గ్రామానికి చెందిన ఎరుకల కిషన్ అతని కరెంట్ అకౌంట్ సిమ్ కార్డు గుర్తుతెలియని వ్యక్తి తీసుకొని పెద్ద మొత్తంలో లావాదేవీలు నిర్వహించినట్లు పోలిసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు దారుడితో పాటు కరీంనగర్‌కు చెందిన మరో వ్యక్తిచే కరెంట్ ఆకౌంట్ ఓపెన్ చేయించి గుర్తుతెలియని వ్యక్తులు లావాదేవీలు నిర్వహించినట్లు సమాచారం.

### చికిత్స పొందుతూ యువకుడి మృతి

గంభీరావుపేట సెప్టెంబరు 5: గంభీరావుపేట మండల కేంద్రానికి సమీపాన ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కందుకూల నవీన్ (27) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మల్లారెడ్డిపేటకు చెందిన నవీన్ 22 రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రితో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

## ఉత్సాహంగా తీజ్ సంబరాలు

● తొమ్మిది రోజుల పాటు బంజారాల వేడుక



తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు



సిరిసిల్లలోని కళాశాల మైదానంలో సంబరాలు

సిరిసిల్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అచార వ్యవహారాలే ప్రాణంగా బంజారాల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే తీజ్ ఉత్సవాలను ఆట పాటలతో గిరిజనులు ఎంతో సంబురంగా జరుపుకున్నారు. గురువారం రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బంజారా సేవాలాల్ సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు తొమ్మిది రోజుల పాటు వేడుకలు జరుపుకొని చివరిరోజు మానేరు తీరం వరకు తీజ్ నిమజ్జనం చేశారు. బతుకమ్మ తరహాలో జరిగే తీజ్ వేడుకలు తొమ్మిది రోజుల పాటు నాలుగు దశలుగా జరుపుకున్నారు. మొదటగా తీజ్ బోరా యేరో బుట్టల్లో గోధుమలను చల్లడం, రెండవది కడావో దేవతకు నైవేద్యం సమర్పించడం, మూడవది గన్‌కోర్ అంటే మేరామా, సేవాలాల్‌ల పెండ్లి, నాలుగోవది గోధుమ నారును చెరువులో వదలడం వేరా యేరోగా పిలిచే వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. బుట్టలతో గిరిజన యువతులు, మహిళలు ఆటలు, పాటలతో నృత్యాలు చేస్తూ వెళ్లారు. నానబెట్టిన బుట్టల్లో పెరిగిన గోదుమ నారు ను అన్నదమ్ములకు పంచారు. వైభవోపేతంగా జరుపుకున్న తీజ్ వేడుకల్లో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, సీఐ కృష్ణ, వీర్నపల్లి మాజీ జడ్పీటీసీ గుగులోతు కళావతి, రైతు బంధు సమితి మాజీ చైర్మన్ గడ్డం నర్సయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు అకునూరి బాలరాజు ఉత్సవాల్లో పాల్గొని గిరిజను లకు శుభాకాంక్షలు తెలిపారు. ఖీమ్యానాయక్, కేకే మహేందర్‌రెడ్డిల బంజారాలు తమ ఉత్సవాలు జరుపుకోవడానికి స్థలం కేటాయింపునకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బంజారా సేవాలాల్ సంఘం ప్రతినిధులు రామిరెడ్డి, దేవ్ సింగ్, గజన్‌లాల్, తిరుపతి, కేపతి, వినోద్, జేత్యా, భూపతి ఉన్నారు.



తీజ్ బుట్టలతో యువతులు

### పోడు భూముల కేసులను ఎత్తివేయాలి

ప్రజాసంఘాల నాయకుల డిమాండ్




సిరిసిల్లలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 5: పోడు భూముల పోరాటాల్లో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులపై పెట్టిన కేసులను రాష్ట్రప్రభుత్వం ఎత్తివేసి అర్హులైన వారందరికి పోడు పట్టాలను అందించాలని ప్రజా సంఘాల నాయకుడు మాల్లారపు అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోడు రైతుల పక్షాన నిలబడి పేదలకు పోడు భూముల హక్కు పత్రాలు ఇవ్వాలనే న్యాయమైన డిమాండ్‌తో పోరాడిన ప్రజా సంఘాల నాయకులపై అక్రమ కేసులు బనాయించి కోర్టుల చుట్టు తిప్పించడాన్ని ఖండిస్తున్నామన్నారు. పోడు రైతుల పక్షాన నిలబడిన ప్రజాసంఘాల నాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. 50 సంవత్సరాల నుంచి పోడు వ్యవసాయం చేసుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ భూమిలేని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే సాగు చేసుకునే అవకాశం కల్పించి హక్కు పత్రాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు జూలపల్లి మనోజ్‌కుమార్, ఇసంపెల్లి కొమురయ్య, జింక పోషయ్య, గుర్రపు నరేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● హక్కు పత్రాలను అందించాలి

పోడు భూముల హక్కు పత్రాలు అందించడంతో పాటు పోరాటం చేసిన నాయకులు, రైతులపై పెట్టిన అక్రమ కేసులను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసి కోర్టుల నుంచి విముక్తి కల్పించాలని లంబాడీల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నరేష్‌నాయక్ డిమాండ్‌చేశారు. 2005 నుంచి 2022 వరకు గిరిజనులపై పేట్టిన పోడు భూ ముల కేసులను ఎత్తివేస్తామని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని ఆ హామీలను అమలు చేయడం లేదన్నారు. కేసులతో గిరిజన రైతులపై తీవ్రమైన మానసిక ఒత్తిడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పోడు రైతులు రాజునాయక్, జగన్‌నాయక్, శ్రీనివాస్ నాయక్, ఇందల్ రాథోడ్, ప్రకాష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న రామగుండం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


మంథనిలో నివాళులర్పిస్తున్న పుట్ట మధు

# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని జిల్లాలో ఘనం గా నిర్వహించుకున్నారు. ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.**

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 5: దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లోనే ఉందని సింగరేణి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు అన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా గురువారం మెడికల్ కళాశాలలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లోనే ఉందని, తాము విద్యార్థులుగా ఉన్నప్పుడు చేసిన పనులను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు రాజు, అనంతబాబు, కల్పన, పులిపాక శిరీష, రమ్య, శిరీష, శ్రీదేవి, రాజు, ఫరీద్ పాల్గొన్నారు.

## సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్, సెప్టెంబర్ 5: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఉపాధ్యాయులకు విద్యార్థులు జ్ఞాపికలు అందించి సన్మానం చేశారు. సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ వారితో స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలకు చెందిన పలువురు మహిళా టీచర్లను ఘనంగా సన్మానించారు. సుల్తానాబాద్‌కు చెందిన ప్రభుత్వ రిటైర్డు ప్రధానోపాధ్యాయురాలు ఎస్ఎన్‌సీ వనజను హైదరాబాద్‌లో శ్రీరామా సేవా సమితి వారు ఘనంగా సన్మానించారు. మండల వ్యాప్తంగా పలు పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకున్నారు.

## ఓదెలలో..

ఓదెల, సెప్టెంబరు 5 : మండలంలోని పొత్కపల్లి హైస్కూల్లో గురువారం సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇదే హైస్కూల్‌లో సేవలందించిన దివంగత ప్రధానోపాధ్యాయుడు నరసయ్య, రాంరెడ్డి, సాబీర్, నరసింహచారి, సరళను స్మరిస్తూ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. బాయమ్మపల్లి ప్రభుత్వ పాఠశాలలో యాదవ సంఘం మండల అధ్యక్షుడు కావటి రాజు ఆధ్వర్యంలో రాధాకృష్ణ జయంతి వేడుకలను నిర్వహించారు. కస్తూర్బా బాలికల పాఠశాలతో పాటు వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి, ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సాంబయ్య, జెట్టి రాధ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, భద్రయ్య, అమృత కిషోర్, రమేష్, జైపాల్‌రెడ్డి, సీఆర్‌పీ రాజేందర్, హరికృష్ణ, పద్మావతి పాల్గొన్నారు.

## కాల్వశ్రీరాంపూర్‌లో..

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 5: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురువారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

## ఎలిగేడులో..

ఎలిగేడు, సెప్టెంబరు 5 : సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఎలిగేడు ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను గురువారం పూర్వ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గంధ్ర దేవేందర్‌రావు, జ్ఞానేశ్వర్, పూర్వ విద్యార్థులు గుడుగుల మహేందర్, అమ్ముల శ్రీనివాస్, మామిడాల రమేష్, కవ్వంపల్లి చంద్రయ్య, దుర్గయ్య నారాయణ, తాటిపల్లి సతీష్‌బాబు, గంగయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని 12గ్రామాల్లో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. పిఆర్‌పిఈ జగదీశ్వర్, హెచ్‌ఎం అనిత, హెచ్‌ఎంలు, సిఆర్‌పి లక్ష్మీనారాయణ, ఐఆర్‌పి సంతోష్, ఉపాధ్యాయులు మహేందర్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సృజన, జిపి కార్యదర్శి శ్రవణ్, సతీష్, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

## రామగిరిలో..

రామగిరి, సెప్టెంబరు 5: సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి పురస్కరించుకొని మండలంలో ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. కల్వచర్లలోని ప్రభుత్వ, కృష్ణవేణి, ప్రగతి, వాణి ప్రైవేట్ పాఠశాలల్లో ఉత్సావాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం ఉపాధ్యాయులకు శాలువ, పూలదండలతో సత్కారించారు. జీవితంలో గురువుల ప్రాముఖ్యత పై వక్తలు మాట్లాడారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో మాజీ జెడ్‌పీటీసీ గంటవెంకటరమణరెడ్డి, నాయకులు కొలిపాక సారయ్య, ముచ్చకుర్తి శ్రీనివాస్, కాటరాజేందర్, సందీప్, రేండ్ల క్రిష్ణమూర్తి మేకల మారుతీ, ఆసం రాజు, కంది మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మంథనిలో..

మంథని, సెప్టెంబరు 5 : డాక్టర్ సర్వే రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంథనిలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో గురువారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక డాక్టర్ సర్వే రాధాకృష్ణన్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలో విద్యాభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. వివిధ పాఠశాలు, కళాశాలల్లో ఉపాధ్యాయులను విద్యార్థుల తోపాటు పలువురు సత్కరించారు. సమాజాభివృద్ధి ఉపాధ్యాయుల పాత్రను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ఏగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, మాచీడి రాజుగౌడ్, కాయిత సమ్మయ్య, ఇర్ఫాన్, కుమార్, సుదర్శన్‌రెడ్డిలు పాల్గొన్నారు.



గోదావరిఖనిలో..


గంగారంలో..

## కమాన్‌పూర్‌లో..

కమాన్‌పూర్, సెప్టెంబర్ 5 : మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని ఆపిల్‌కిడ్స్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎస్ఐ కె. ప్రసాద్ హజరయ్యారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి విలువ గురించి వివరించారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. రాధాకృష్ణ చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ చదువు వెంకట్‌రెడ్డి నివాళులర్పించారు. అలాగే మండలంలోని జూలపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా గుర్తింపు తెచ్చుకున్న నాగరాజును మండల యూత్ అధ్యక్షుడు బొమ్మగాని అనిల్‌గౌడ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆదివరహాస్వామి ఆలయ మాజీ డైరెక్టర్ బొజ్జ నరసింహచారి, ప్రిన్సిపాల్ రాజమణి భూలక్ష్మి, గౌతమి, రజిత, బేజా పౌజియా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గోదావరిఖనిలో..

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరే 5: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు గురువారం గోదావరిఖనిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అడ్డగుంటపల్లిలోని కృష్ణవేణి పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ మంజుల శ్రీనివాస్‌రెడ్డి హాజరై సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. విద్యార్థుల స్వయం పరిపాలన కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా పాఠాలు బోధించారు. విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు. అలాగే ఉత్తమ ప్రతిభకనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ జయకిషన్ ఓజా రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఉపాధ్యాయదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమాకాంత్ హాజరై గురుపూజోత్సవం విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. అధ్యాపకులు సురేష్‌కుమార్, రమేష్ రెడ్డి, అజయ్‌కుమార్, యాదయ్య, రవి, వైప్రసాద్, సావిత్రి, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక రామగుండం బాలికల గురుకుల కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ మాధవి, జెవీపి పావని, రజిత, కళాశాల పేరంట్స్ కమిటీచైర్మన్ కాంపెల్లి సతీష్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఉపాధ్యాయులు, పేరంట్స్ కమిటీ పాల్గొన్నారు. స్థానిక రమేష్‌నగర్‌లోని ఉషోదయ హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ కొత్త శ్రీనివాస్‌రెడ్డి సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేశారు. దేశానికి సర్వేపల్లి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థుల స్వయంపాలన కార్యక్రమంలో ఉపాధ్యాయులుగా విద్యార్థులు పాఠాలు బోధించారు. స్థానిక ఆపిల్ కిడ్స్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ గాలి సునీత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రటానికి పూలమాల వేశారు. ఈసందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా బోధన చేశారు. ఈ కార్యక్రమంలో ఫర్హానా, అరుణ, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

**మార్కండేయకాలనీ** : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గోదావరిఖని విఠల్‌నగర్‌లో శ్రీదేవి విద్యానికేతన్ వ్యవస్థాపకులు భాష్యం పాపయ్యశాస్త్రి దంపతులను గురువారం పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. గోదావరిఖని మార్కండేయకాలనీలోని ఒక రెసిడెన్సీలో జరిగిన కార్యక్రమంలో పాపయ్యశాస్త్రి దంపతులకు సన్మానించారు. పూర్వ విద్యార్థులు జల్లా కుమార్, సీపీఐ కనకరాజ్, కుక్కల రాజయ్య, గుండబోయిన అజయ్, పోతరాజు రవి, పర్లపెల్లి రవి, బాలు, బండ రాజేశం, పులిపాక రమేష్, పాముకుంట్ల భాస్కర్, రాజేంద్ర, విజయ లక్ష్మి, శశికళ, అమీనా బేగం, శ్రీదేవి, శ్రీలత పాల్గొన్నారు.

## యైటింక్లయిన్ కాలనీలో..

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 5 : సెక్టార్-3 సింగరేణి స్కూల్‌లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. పర్సనల్ మేనేజర్ అనిల్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా 2023-24 విద్యా సంవత్సరంలో పదవతరగతిలో ఉత్త మ ఫలితాలు వచ్చేలా కృషి చేసిన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు నగదు బహుమతిని ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సుందర్‌రావు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**జ్యోతినగర్** : స్థానిక విశ్వభారతి పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ముఖ్యఅతిథిగా హాజరై ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రసంగిస్తూ అన్ని వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృత్తి గొప్పదన్నారు. విద్యార్థులను భావి పౌరులుగా తయారు చేసే ఉపాధ్యాయులను ప్రతి పౌరుడు గౌరవించాలన్నారు. ఉపాధ్యాయులు మరింత అంకిత భావంతో విద్యా బోధన చేసి విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమానికి విద్యా సంస్థల చైర్మన్ బందారపు యాదగిరి గౌడ్ అధ్యక్షత వహించగా హెచ్‌ఎంలు తిరుపతి గౌడ్, ప్రవీణ్‌కుమార్, నోయల్ జోసఫ్, ఆశాలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాలకుర్తిలో..

పాలకుర్తి, సెప్టెంబరు 5: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో గురువారం ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఉత్తమ గురువులను సత్కరించారు. పాఠశాలల్లో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా పాఠాలు బోధించి స్వయం పాలనా దినోత్సవాన్ని నిర్వహించారు. గురువులను సత్కరించడంతో పాటు జ్ఞాపికలను అందించారు.

## పెద్దపల్లిలో మండలంలో..

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 5 : మండలంలోని పలు గ్రామాల్లో, పాఠశాలల్లో, కళాశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాసులపల్లి ట్రినిటి పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు బాపురెడ్డి, ఉపాధ్యాయులు రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి వేడుకలు నిర్వహించారు. పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ప్రిన్సిపాల్ డా.కె.లక్ష్మీనర్సయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు. పెద్దబొంకూరు మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో వేడుకలు నిర్వహించారు. అలాగే పలు ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో వేడుకలు నిర్వహించారు.

## జూలపల్లిలో..

జూలపల్లి, సెప్టెంబరు 5 : మండలకేంద్రంతో పాటు అయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాటశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలను ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయా పాఠశాలల్లో స్వయంపాలన కార్యక్రమంలో బాగంగా విద్యార్థులు టీచర్లుగా పాఠాలను బోధించి పలువురు విద్యార్థులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పొత్కపల్లిలో..


రామగిరిలో..


ఎలిగేడులో..

# రామగుండంలో మళ్లీ డివిజన్ల పునర్విభజన

● కసరత్తు చేస్తున్న మున్సిపల్ శాఖ
● డివిజన్ల సంఖ్య 60కి పెరిగే అవకాశం..

కోల్‌సిటీ, సెప్టెంబరు 5 : రామగుండం నగరపాలక సంస్థలో మళ్లీ డివిజన్ల పునర్విభజనకు అవకాశాలు అవకాశాలున్నాయి. కార్పొరేషన్‌లోని డివిజన్లను పెం చాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రభు త్వానికి లేఖ రాయడంతో ఈమేరకు మున్సిపల్ శాఖ కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం కార్పొరేషన్‌లో 50డివి జన్లు ఉన్నాయి. 97చదరపు కిలోమీటర్లు ఉన్న రామగుండం నగరపాలక సంస్థలో రామగుండం, ఎన్‌టీపీ సీ, గోదావరిఖని, ఎఫ్‌సీఐ ఏరియా, యైటింక్లయిన్‌కా లనీ ప్రాంతాలున్నాయి. విలేజీ రామగుండం నుంచి అల్లూరు వరకు రామగుండం నగరపాలక సంస్థ విస్తరించి ఉంది. రామగుండం మున్సిపల్ కార్పొరేష న్ ప్రాంతం మొదట నోటిఫైడ్ ఏరియాగా అవతరిం చింది. విలేజి రామగుండం, మేడిపల్లి, మల్యాలపల్లి, జనగామ, మ్యారేడుపాక, అల్లూరు, మల్కాపూర్, కాజిపల్లి, వీర్లపల్లి గ్రామాలతో పాటు ఎల్కలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం కలిపి నోటి ఫైడ్ ఏరియాగా ఏర్పాటు చేశారు. తరువాత క్రమంలో మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్‌గా అవత రించింది. ప్రస్తుతం రామగుండం నగరపాలక సంస్థ లో 50 డివిజన్లు ఉన్నాయి. డివిజన్ల పునర్విభజన శాస్త్రీయంగా జరుగలేదని, ఒక డివిజన్‌లో అత్యధిక ఓటర్లు, మరో డివిజన్‌లో అత్యల్ప ఓటర్లు ఉన్నారనే విమర్శలున్నాయి. అభివృద్ధి చెందిన ప్రాంతాలు పెద్ద డివిజన్లుగా ఉన్నాయి. కార్పొరేషన్‌లోని మార్కండేయ కాలనీ, చంద్రబాబుకాలనీ, శారదానగర్ విస్తరించి ఉన్న 25, 26డివిజన్లు పెద్ద డివిజన్లుగా ఉన్నాయి. ఎన్‌టీపీసీ టౌన్‌షిప్ ఏరియా చిన్న డివిజన్‌గాఉంది. ఇటీవల కాలంలో ఎన్‌టీపీసీ కృష్ణనగర్ ఏరియా, పవర్‌హౌస్‌కాలనీ, అడ్డగుంటపల్లి ప్రాంతాలు విస్త రించాయి. కార్పొరేషన్ మొదటి పాలకవర్గంలో 50 డివిజన్లు ఉండగా గత ఎన్నికల సందర్భంగా 50 డివిజన్లు పునర్విభజన చేశారు. ఈ పునర్విభజనలో కొన్ని కొన్ని దూర ప్రాంతాలు కూడా ఒక్కే డివిజన్ లో కలిశాయి. జనగామ గ్రామానికి జీఎంకాలనీ ఏరి యాలోని కొంత భాగాన్ని కలిపారు. గౌతమినగర్ పక్కనే ఉన్న చైతన్యపురి కాలనీ, ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్, లక్ష్మీపురం, వీర్లపల్లిని ఒక డివిజన్‌గా మార్చారు.


రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

ఇలా కొన్ని డివిజన్లలో జనాభా పెరుగగా కొన్ని డివి జన్లలో జనభా తగ్గుకుంటూ వచ్చింది. ఈ పరిస్థితుల్లో కార్పొరేషన్ డివిజన్లను పునర్వి భజన చేయాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రతిపాదించారు. దీంతో 50డివిజన్లను 60 డివిజన్లుగా మార్చే అవకాశాలు ఉన్నాయి.

## ఆశావాహుల్లో సందడి

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో డివిజన్ల సంఖ్య పెరిగే అవకాశం ఉండడం, డివిజన్ల హద్దులు, స్వరూపాలు మారే అవకాశం ఉండడంతో ఆశావాహుల్లో సందడి మొదలైంది. ప్రస్తుత పాలకవర్గం గడువు జనవరితో ముగుస్తుండడంతో ఆయా డివిజన్లలో ఆశావాహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఆయా కాలనీల్లోని పెద్దమనుషులు, యువకులతో టచ్‌లో ఉంటున్నారు. వివిధ శుభకార్యాలు, పుట్టిన రోజుల సందర్భంగా సందడి చేస్తున్నారు. ప్రభుత్వ పథకాల అమలు గురించి ఇంటింటా తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. తాజాగా గణపతి ఉత్సవాల నిర్వహణపై కూడా చొరవ చూపుతున్నారు.

## అందరూ మొక్కలు నాటాలి

సుల్తానాబాద్, సెప్టెంబరు 5: సమాజంలో పెరిగిపోతున్న కాలుష్యం నివారణకు అందరూ విరివిగా మొక్కలు నాటాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షులు మాటేటి సంజీవ్ కుమార్ అన్నారు. గురువారం సుల్తానాబాద్ పట్టణంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం స్థానిక మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు నీలయ్య, శ్రీనివాస్, అశోక్, భూమేష్, వెంకటేశం, సాంబమూర్తి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పుట్ట మధు పరామర్శ

మంథని, సెప్టెంబరు 5: మండలంలోని పలు గ్రామాల్లో వివిధ కారణాలతో మృతిచెందిన వారి బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు గురువారం పరామర్శించారు. మండలంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఇటీవల వడ్లకొండ సతీష్, అందె రాములు మృతి చెందగా వారి, మాజీ సర్పంచ్ తండ్రి కనవేన శ్రీనివాస్ తండ్రి పెద్దఓదెలు, నాగెపల్లి గ్రామంలో దబ్బెట తిరుపతిల ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈకార్యక్రమాల్లో బీఆర్ఎస్ నేతలు ఏగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, ఎక్కేటి అనంతరెడ్డి, మిర్యాల ప్రసాద్‌రావులు పాల్గొన్నారు.

## ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 5: మున్సిపల్ సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పెద్దపల్లి చైర్‌పర్సన్ మమతారెడ్డి సూచించారు. మున్సిపాలిటీలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మమతారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బంది ఆరోగ్యమే కౌన్సిల్ ధ్యేయమన్నారు. సిబ్బంది ఆరోగ్య కోసం ప్రైమరీ హెల్త్ సెంటర్ సిబ్బందిచే మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు తెలిపారు. మున్సిపల్ సిబ్బంది భారీ వర్షాలను సైతం లెక్కచేయకుండా పట్టణంలో మురికి కాలువలో, రోడ్లపై ఉన్న చెత్తను తీసి వేస్తూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నారన్నారు. ఇంట్లో నుంచి వెలువడే చెత్తను రోడ్లపై మురికి కాలువలో వేయకుండా మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి అందచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఆకుల వెంకటేష్, కౌన్సిలర్ షాహీధ సబీర్ ఖాన్ పాల్గొన్నారు.

## ఆలయ భూమి పట్టాకు యత్నం

### -చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు వినతి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 5: మండలంలోని పెద్దబొంకూరు గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్ 489/బిలో విస్తీర్ణం 14 గుంటల భూమిని గ్రామస్థులంతా ఆలయం కోసం కొనుగోలు చేయగా కొందరు అక్రమ పట్టా చేసుకునేందుకు యత్నిస్తున్నారని ఆలయానికి పట్టా చేసేందుకు చర్యలు తీసుకోవాలని గురువారం మాజీ సర్పంచ్ మిట్టపల్లి కనుకయ్య, గ్రామస్థులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా మాజీ సర్పంచ్ కనుకయ్య మాట్లాడుతూ కొన్నేళ్ల క్రితం శివాలయం నిర్మాణం కోసం గ్రామస్థులంతా డబ్బులు పోగు చేసుకొని భూమిని కొనుగోలు చేశామన్నారు. ఇప్పుడు కొంతమంది వ్యక్తులు ఆ భూమిపై కన్నువేశారన్నారు. అధికారులు చొరవ తీసుకొని ఆలయం పేరుపై రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించాలని తహసీల్దార్‌ను కోరినట్లు తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో మొగుసాల రమణారెడ్డి, మిట్టపల్లి శ్రీనివాస్, కల్వల తిరుపతిగౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలి


మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న అధ్యాపక బృందం

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 5: విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలని ట్రినిటి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ట్రినిటి బీఈడీ, డీఈడీ చాత్రోపాధ్యాయుల వార్షిక సమ్మేళనం వీడ్కోలు సమావేశంలో గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా దాసరి మనోహర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. మొదట మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేయగా, సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి దాసరి మనోహర్‌రెడ్డి నివాళులర్పించారు. అనంరత విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌లు రజని, తిరుపతి, హరి, రెడ్డమ్మ, దిలీప్ శర్మ, మధుకర్, గోపి, తిరుపతి, రమేష్, సుజాత, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

అంతర్గాం, సెప్టెంబరు 5: రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయించి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. బుధవారం అంతర్గా మండల పరిధిలోని సోమనపల్లి గ్రామంలో రూ.25లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి మాట్లాడారు. మహిళలకు ఆర్‌టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, గృహ జ్యోతి పథకం ద్వారా ప్రతి ఇంటికి ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెండ్రు హన్మాన్‌రెడ్డి, ఉరిమెట్ల రాజలింగం, గుంట లక్ష్మణ్, బాపు, మడ్డి తిరుపతిగౌడ్, సతీష్‌గౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

## 'డ్రైనేజీని ఆక్రమించిన వారిపై చర్య తీసుకోవాలి'

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 5: పట్టణంలోని సుభాష్‌నగర్‌లో డ్రైనేజీని ఆక్రమించుకుని దానిపై రోడ్డు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత లేబర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బొంకూరి కైలాసం, అంబాల నరేష్ మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో తాము కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, ఈ విష యంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ స్పందించి చర్యలు చేప ట్టాలని కోరారు. గత వారం రోజుల నుండి కురుస్తున్న వర్షాల వల్ల శుభాష్ కాలనీ నీరు బయటకు పోకుండా ఈ కబ్జాతో నీట మునిగిందన్నారు. దీనిని వేంటనే తొలగించి కాలనీ వాసుల ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేశారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

సుల్తానాబాద్, సెప్టెంబరు 5: విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలని సుల్తానాబాద్ ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని గర్రెపల్లి సోషల్ వేల్ఫేర్ గురుకులం, భూపతిపూర్‌లోని కస్తూర్బా బాలికల గురుకుల కళాశాలను గురువారం సందర్శించారు. ఆయా గురుకులాల్లో వంట శాలలను, స్టోర్‌రూములను ఎంపీడీవో గురువారం సందర్శించారు. ఎంపీడీవో వెంట కార్యదర్శి ఆయోషా, ప్రిన్సిపాల్ ఉన్నారు.

## పంటలను పరిశీలించిన ఏడీఏ

మంథని, సెప్టెంబర్ 5: పట్టణ శివారులోని, మండలంలోని వివిధ గ్రామాల్లోని పంటలను మంథని ఏడీఏ అంజలి గురువారం పరిశీలించారు. వరి, పత్తి పంటలను ఆమె పరిశీలించిన అనంతరం అధిక వర్షాల కారణంగా పంటలు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. ఆమె వెంట వ్యవసాయాధికారులు ఉన్నారు.